క్లుప్తంగా

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

సంతనూతలపాడు: స్థానిక బస్టాండు సెంటర్ వద్ద దాత, వాసవీ క్లబ్ ప్రతినిధి గ్రంధి లక్ష్మీప్రసాద రావు, సులోచన దంపతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మినీ కూలింగ్ చలివేంద్రం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి ప్రారంభించారు. సంతనూతలపాడు వాసవీ క్లబ్ సెక్రటరీ వేమూరి ఆంజనేయులు, లక్ష్మి వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారి కుమారులు ప్రసన్న రాకేష్, మణిదీప్ మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పేదలకు అన్నదానం

సంతనూతలపాడు: సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 51వ వారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ సభ్యుడు, దాత దాచర్ల శివయ్య కుమారుడు డాక్టర్ మంజునాథ్ చౌదరి జన్మదినోత్సవం సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం పేదలకు అన్నదానం చేశారు.

కేజీబీవీలో ఇంటర్ కాలేజీకి శంకుస్థాపన

కొత్తపట్నం: మండలంలోని మోటుమాల గ్రామంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహిస్తున్న ఇంటర్ తరగతులకు భవనాన్ని నిర్మించేందుకు రూ.1.52 లక్షలతో బుధవారం శంకుస్థాపన చేశారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, అధికారులు పాల్గొని భూమి పూజ చేశారు. ఎంఈఓ టి.పద్మావతి, కన్‌స్ట్రక్షన్ డీఈ జనార్దన్, కేజీబీవీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అరుణ్ కుమారి, మాజీ ఎంపీపీ నరసమ్మ, గౌడకార్పొరేషన్ డైరెక్టర్ జంపాల రామచంద్రయ్య, కాంట్రాక్టర్ కొమ్మినేని బాలచంద్, ఆలా శ్రీనివాస్ పాల్గొన్నారు.


భక్తులకు తాళిబొట్టు చూపిస్తున్న యాగ్నీకుడు దివి వెంకట శేషాచార్యులు, ప్రధాన అర్చకుడు నారాయణం వెంకటాచార్యులు


స్వామివారి కల్యాణంలో భారీగా పాల్గొని గోవింద నామస్మరణ చేస్తున్న భక్తులు


రెడ్డి సంఘం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, ఇతర నాయకులు


స్వామివారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం

- గోవింద నామస్మరణతో హోరెత్తిన మల్లవరం
- భక్తులకు శ్రీవారి భజన బృందాలు, సేవా సమితులు మజ్జిగ, మంచినీరు, రస్నాల పంపిణీ
- కులసంఘాల ఆధ్వర్యంలో అన్నదానం
- ఆనవాయితీగా స్వామివారి తలంబ్రాలు తీసుకొచ్చిన పల్లకి వంశీయులు

మద్దిపాడు: జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన మద్దిపాడు మండలంలోని మల్లవరంలో గల పద్మావతీ అలివేలుమంగా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని బుధవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఆగమ ప్రవర శ్రీ దివి వెంకట శేషాచార్యులు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు నారాయణం వెంకటాచార్యులు కల్యాణం జరిపించారు. ఉదయం పదిగంటల సమయంలో గుండ్లాపల్లి గ్రామానికి చెందిన పల్లకి మణికంఠ శ్రీనివాస రెడ్డి, పల్లకి తరుణాదిత్య నాగకృష్ణ సాయికుమార్ రెడ్డి, పల్లకి భరణీ కృష్ణమోహనరెడ్డి ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులు తానిగుండాల యర్రారెడ్డి, సీతామహాలక్ష్మి దంపతులు, వేముల వెంకట సత్యనారాయణరెడ్డి, వేముల షాలినీరెడ్డి స్వామివారు, అమ్మవార్లకు పట్టువస్త్రాలు కల్యాణ తలంబ్రాలు తీసుకువచ్చారు. కల్యాణ విరామ సమయాలలో ఘోరకవి సంపత్ ఆధ్వర్యంలో తరంగ కాలక్షేపం వీనుల విందుగా జరిగింది. స్వామివారి కల్యాణం ప్రారంభం కావడంతో భక్తులు కల్యాణ మండపంలోకి భారీగా చేరుకుని వీక్షించారు. గోవిందా అనే నామస్మరణతో మల్లవరం హోరెత్తింది. ఒకవైపు కల్యాణం జరుగుతున్న క్రమంలో మరోవైపు స్వామివారి దర్శనం చేసుకోవడానికి భక్తులు వేసవి తాపాన్ని సైతం లెక్కచేయకుండా క్యూలో నిలబడ్డారు. భారీగా భక్తులు స్వామివారిని దర్శించుకుని ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం స్వామివారి లడ్డూ ప్రసాదాలు అందుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వెంకటేశ్వరస్వామి భజన బృందాలు, స్వామివారి సేవా సమితులు, శ్రీవారి వనం సభ్యులు, పలువురు దాతలు మజ్జిగ, చల్లని మంచినీరు, రస్నాలు వంటి పానీయాలు పంపిణీ చేశారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామివారి కల్యాణానంతరం పలువురు భక్తులు కానుకలు సమర్పించుకున్నారు. అనంతరం స్వామివారి తలంబ్రాలు తీసుకోవడానికి మహిళా భక్తులు ఎగబడటంతో రద్దీ నెలకొంది. వెంటనే పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకుని భక్తుల రద్దీని నివారించి వారిని క్యూలైన్ ద్వారా బయటకు పంపించివేశారు. స్వామివారి కల్యాణానంతరం భక్తులకు వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మద్దిపాడు ఎస్‌ఐ శివరామయ్య పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా చూశారు. మద్దిపాడు పీహెచ్‌సీ డాక్టర్ జగదీష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు.


ప్రత్యేక అలంకరణలో మల్లవరం వెంకటేశ్వరస్వామి


స్వామివారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, వైఎస్సార్ సీపీ నాయకులు


స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకొస్తున్న పల్లకి వంశీయులు

వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున...

మల్లవరంలో పద్మావతీ, అలివేలుమంగా సమేత వెంకటేశ్వరస్వామిని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి దర్శించుకున్నారు. బుధవారం మధ్యాహ్నం స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. మేరుగుకు స్వామివారి శేషవస్త్రాన్ని ఆలయ అర్చకులు అందించారు. అనంతరం కొండ దిగువ భాగంలో ఉన్న రెడ్డి అన్నదాన సత్రాన్ని ఆయన సందర్శించారు. సత్రం నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో మేరుగు నాగార్జున పాల్గొన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు వాకా కోటిరెడ్డి, మల్లవరం సర్పంచ్ నారా సుబ్బారెడ్డి, పల్లకి సత్యనారాయణరెడ్డి, బెజవాడ సురేష్, పల్లకి రామసుబ్బారెడ్డి, అన్వేష్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బాలోత్సవ్ చిల్డ్రన్ సమ్మర్ క్యాంపు


బాలోత్సవ్ సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమంలో సర్టిఫికెట్లతో విద్యార్థులు


జిల్లా గ్రంథాలయంలో బొమ్మలు గీస్తున్న చిన్నారులు

ఒంగోలు టౌన్: ప్రకాశం బాలోత్సవ్, ఒంగోలు చిల్డ్రన్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న చిల్డ్రన్ సమ్మర్ క్యాంప్ బుధవారంతో ముగిసింది. 10 రోజుల పాటు నిర్వహించిన ఈ వేసవి శిబిరంలో మొత్తం 65 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మెమరీ టెక్నిక్స్ ద్వారా మనకు అవసరమైన సమాచారాన్ని ఎక్కువ రోజులు ఎలా గుర్తించుకోవాలో నేర్పించారు. శత్రువుల నుంచి ఆడపిల్లలు తమను తాము రక్షించుకునేందుకు కరాటేలో శిక్షణ ఇచ్చారు. మాయలు, మంత్రాల వంటి మోసాలకు గురికాకుండా సైన్స్ ప్రయోగాలు, ఇంద్రజాలంలో మెళకువలను తెలిపారు. ఇంగ్లిష్ గ్రామర్, క్రాఫ్టింగ్, పెయింటింగ్‌లో శిక్షణ ఇచ్చారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పోరాట యోధుల చరిత్రను పరిచయం చేశారు. పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో మరణించిన మురళీ నాయక్‌కు నివాళులర్పించారు. తద్వారా పిల్లలు దేశ భక్తి కలిగి ఉండాలని బోధించారు. శిక్షణ శిబిరంలో విశ్రాంత తహసీల్దార్ షేక్ ఇస్మాయిల్, మాంటిస్సోరి ప్రకాశ్, విశ్రాంత ఉపాధ్యాయుడు మాలిక్, మాల్యాద్రి, పీఎస్ఎం జ్యోతి, ఐద్వా రమాదేవి పాల్గొని వివిధ అంశాల గురించి విద్యార్థులకు బోధించారు. వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బాలసుబ్రహ్మణ్యం, వీరాంజనేయులు, అబ్దుల్ హై, జయప్రకాశ్, కంకణాల రమాదేవి, కె.విజయ్, సీహెచ్ వినోద్ తదితరులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై సరదాగా గడిపారు.

జిల్లా గ్రంథాలయంలో...

జిల్లా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం బుధవారం 14వ రోజుకు చేరింది. 105 మంది విద్యార్థులు, చిన్నారులు హాజరయ్యారు. పిల్లలకు నీతి కథలు బోధించారు. పర్సనాలిటీ డెవలప్మెంట్, యోగా, మెడిటేషన్ నేర్పించారు. కూచిపూడి నాట్యం, హ్యాండ్ రైటింగ్‌లో శిక్షణ ఇచ్చారు. కాశీ విశ్వనాథ్, జాలాది మోహన్, నాగలక్ష్మి, వి.వెంకయ్య, ఆర్.బిందుమణి, టి.శ్రీనివాసరావు శిక్షకులుగా వ్యవహరించారు. గ్రంథాలయ ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

క్విస్ కాలేజీ పీడీకి ఉత్తమ అవార్డు

ఒంగోలు సిటీ: స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.కోటేశ్వరరావుకు బెస్ట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పర్సన్ అవార్డు లభించింది. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ కాకినాడలో నిర్వహించిన విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ డే సెలబ్రేషన్స్‌లో కోటేశ్వరరావుకు ఈ అవార్డు ప్రదానం చేశారు. విద్యార్థులు వివిధ పోటీల్లో సత్తా చాటేలా ఉత్తమంగా తీర్చిదిద్దినందుకు అవార్డు ఇచ్చారు. ఆయనతో పాటు యూనివర్సిటీ స్థాయిలో స్పోర్ట్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కూడా అవార్డులు ప్రదానం చేశారు. ఎస్.మహేంద్ర, ఎస్‌కే కరిముల్లా, పి.మణికంఠ, టి.భార్గవిలను సన్మానించారు. వారికి ప్రశంస పత్రాలు అందించి ప్రోత్సహించారు. ఇక బీటెక్ మూడో ఏడాది చదువుతున్న భార్గవి కిక్ బాక్సింగ్‌లో వివిధ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ప్రోత్సహిస్తూ రూ.20,000 నగదు బహుమతి కూడా అందించారు. అవార్డులు పొందిన పీడీ కోటేశ్వరరావు, విద్యార్థులను విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రి, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.హనుమంతరావు అభినందించారు. తమను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్న కాలేజీ యాజమాన్యానికి కోటేశ్వరరావు, విద్యార్థులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న క్విస్ కళాశాల పీడీ కోటేశ్వరరావు

ప్రజా సమస్యలపై పోరాడదాం


ఇనమనమెళ్లూరులో పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న మేరుగు నాగార్జున

- మాజీ మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: అధికారం ఉన్నా..లేకున్నా ప్రజా సమస్యలపై పోరాటమే వైఎస్సార్ సీపీ లక్ష్యమని ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున అన్నారు. బుధవారం మండలంలోని ఇనమనమెళ్లూరు, వెల్లంపల్లి గ్రామాల్లో పార్టీ గ్రామ కమిటీల ఎంపికను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామస్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామ సమస్యలను ఇటువంటి కమిటీల ద్వారా పరిష్కరించేందుకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇనమనమెళ్లూరు గ్రామ అధ్యక్షునిగా రావులపల్లి శ్రీనివాసరావు, వెల్లంపల్లి గ్రామ అధ్యక్షునిగా దాట్ల సుబ్బారావు, కార్యదర్శులు, ఉపాధ్యక్షులుగా ఆయా గ్రామాలకు చెందిన ముఖ్య నేతలను ఎంపిక చేసినట్లు కన్వీనర్ పేర్కొన్నారు.

నేత్రపర్వంగా చెన్నకేశవస్వామి కల్యాణం


దేవేరుల తలంబ్రాల ఘట్టంలో అర్చకులు


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

ఒంగోలు మెట్రో: కొప్పోలు కేశవస్వామిక్షేత్రంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఏడో రోజు ఉదయం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. యాగ్నిక బ్రహ్మ మురళీకృష్ణమాచార్యులు పరాంకుశ చక్రవర్తి స్వామి, నారాయణ కళ్యాణ్ చక్రవర్తి, సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో దేవస్థానం ప్రాంగణంలో వేదికపై ఏర్పాటు చేసిన కల్యాణ పందిరిలో స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను చూడచక్కగా కొలువుదీర్చారు. నేత్రపర్వంగా కల్యాణ క్రతువు నిర్వహించారు. దంపతులుగా వ్యవస్థాపక ధర్మకర్తలు వెంకట శేషారెడ్డి కుమారులు విజయరామిరెడ్డి, సువర్ణ దంపతులు పాల్గొన్నారు. అశేషంగా తరలివచ్చిన భక్తులు అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుని కల్యాణాన్ని కనులారా తిలకించి దేవేరుల అనుగ్రహానికి పాత్రులయ్యారు. అనంతరం అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. సాయంత్రం గుడి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవస్థాన ప్రధాన అర్చకుడు పరాంకుశ సమీర్‌కుమార్, దేవదాయ ధర్మాదాయశాఖ కార్యనిర్వహణాధికారి కట్ట సునీల్ కుమార్ వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం కార్యక్రమాలు జరిపించారు.

వైఎస్సార్ సీపీ సభ్యురాలి మృతికి మేరుగు సంతాపం


లేయమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: మండలంలోని బూరేపల్లి పునరావాస కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ సభ్యురాలు, కాపూరి యాకోబు తల్లి లేయమ్మ మృతిచెందగా, ఆమె జ్ఞాపకార్థ కూడికలో మాజీ మంత్రి, పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మండలంలోని ఇనమనమెళ్లూరు ఎస్సీ కాలనీలో గంటా నాగేంద్రమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, రాష్ట్ర ఎస్సీ విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమ్మూరి కనకారావు, అన్వేష్, కొమ్మూరి సుధాకర్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు వాకా కోటిరెడ్డి, నాదెండ్ల మహేష్, వెంకటాద్రి, సన్నపురెడ్డి రమణమ్మ, చిన్న, రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత

ఒంగోలు సిటీ: స్థానిక పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థులు సీబీఎస్ఈ పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రధానాచార్యులు వి.గీతాలక్ష్మి బుధవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ తమ విద్యాలయం నుంచి 12వ తరగతి పరీక్షలకు 31 మంది, 10వ తరగతి పరీక్షలకు 75 మంది హాజరైనట్లు తెలిపారు. ఈ రెండు తరగతుల విద్యార్థులంతా ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. 12వ తరగతి ఫలితాల్లో 500 మార్కులకుగానూ 429 మార్కులతో వరుణ్ నాయుడు ప్రథమ స్థానాన్ని, 412 మార్కులతో షేక్ రఫీ రెండో స్థానాన్ని, 402 మార్కులతో కొల్లూరు సాయి సందీప్ మూడో స్థానాన్ని పొందారన్నారు. 10వ తరగతి ఫలితాల్లో 500 మార్కులకుగానూ 478 మార్కులతో ఆర్.హేమంత్ సాయినాథ్‌రెడ్డి, పి.పవన్ కళ్యాణ్ సంయుక్తంగా మొదటి స్థానాన్ని, 476 మార్కులతో డి.తేజారామ్ రెండో స్థానాన్ని, 470 మార్కులతో పి.అర్జున్, పి.జానకి సంయుక్తంగా మూడో స్థానాన్ని పొందారని వివరించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రధానాచార్యులతో పాటు ఉప ప్రధానాచార్యులు సి.శివరామ్, ఉపాధ్యాయులు, విద్యాలయ సిబ్బంది అభినందించారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం


నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో వేణుగోపాల స్వామి దేవస్థానంలో రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వేదపండితుల సమక్షంలో స్వామివారికి ఈవో రామకృష్ణారావుతో పాటు పురాతనంగా వస్తున్న ఆనావాయితీ ప్రకారం మాగులూరి వంశస్తులైన మాగులూరి శ్రీనివాసరావు దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. మంగళసూత్రధారణతో కల్యాణ ఘట్టం పూర్తి చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. కొంజేటి వెంకట సురేష్ దంపతులు, బెల్లం వెంకటేశ్వర్లు దంపతులు, ఉప్పుగుండూరు వేణు దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. తెలగ సంఘం ఆధ్వర్యంలో సాయంత్రం వైభవంగా రథోత్సవం జరిగింది. ఉప్పుగుండూరుతో పాటు వివిధ గ్రామాల నుంచి మహిళలు, పిల్లలు, పెద్దలు తరలివచ్చి రథం లాగారు. రథోత్సవంలో బాలబాలికలు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. పూజారి దీవి శ్రీధరాచార్యులు, శిష్టా పాండురంగయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సింధూర అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

ఒంగోలు మెట్రో: స్థానిక గద్దలగుంట రాజాపానగల్ రోడ్డులో ఉన్న ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 22వ తేదీ హనుమాన్ జయంతి పండుగ సందర్భంగా బుధవారం నుంచి ఉత్సవాలు ప్రారంభించారు. ఉదయం వినాయకుని పూజ, గోపూజ, తులసి పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. ఆలయ అర్చకులు ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. పాల్గొన్న భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం ప్రసన్నాంజనేయస్వామిని సింధూరంతో విశేషంగా అలంకరించి నాగావళి దళాలతో సహస్రనామార్చన, పూజా కైంకర్యాలు నిర్వహించి మంగళ హారతులతో భక్తులకు స్వామివారి దివ్యదర్శన భాగ్యం కల్పించారు. ఆలయ చైర్మన్ ఈదుపల్లి దశరథ రామారావు, రేణుకాదేవి దంపతులు, ఓం శ్రీహరి పారాయణ భక్త బృంద సభ్యులు, ఓగిరాల సాయి, చెంగరశెట్టి చరణ్, బత్తుల వేణు, శంకర్, సంతోష్ కిరణ్, తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.


విశేష అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

మరో గ్రంథాలయ ఉద్యమం చేస్తాం


దేశ నాయకుల వేషధారణలో పాల్గొన్న క్విస్ కాలేజీ విద్యార్థులు

ఒంగోలు మెట్రో: మేము సైతం మరో గ్రంథాలయ ఉద్యమం చేస్తామంటూ స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు అన్నారు. ఇంజినీరింగ్ కాలేజీలో రీడర్స్ క్లబ్ ఏర్పాటుతో దేశ నాయకుల వేషధారణతో మరో గ్రంథాలయ ఉద్యమ యాత్రలో బుధవారం వారు పాల్గొన్నారు. సెల్‌ఫోన్, సోషల్ మీడియాలు యువతను నిర్వీర్యం చేస్తున్న నేటి తరుణంలో యువత ముందుకు రావడం, స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో తమను తాము చూసుకోవడం అభిలషణీయమని మరో గ్రంథాలయ ఉద్యమకారుడు మంచికంటి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. యువతను పుస్తక పఠనంతో తీర్చిదిద్ది కవులుగా, రచయితలుగా, ఆలోచనాపరులుగా రూపొందించే కార్యక్రమం మే నెల అంతా కొనసాగుతుందని గ్రంథాలయ ఉద్యమ కార్యదర్శి కాంతి నల్లూరి తెలిపారు. పుస్తకానికి పట్టం కడదాం పుస్తకాన్ని ఊరేగిద్దాం అనే కార్యక్రమంలో డాక్టర్ కొర్రపాటి సుధాకర్, క్విస్ ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ శిరీష, డాక్టర్ జాలాద్ మణిబాబు, ఓపీడీఆర్ సుధాకర్, కుర్రా ప్రసాద్‌బాబు, నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, రైతు సంఘ నాయకుడు చుండూరి రంగారావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్లు


వైఎస్సార్ సీపీ విద్యుత్ ప్రభపై సాంస్కృతిక కార్యక్రమాలు

చీమకుర్తి రూరల్: మండలంలోని కూనంనేనివారిపాలెం గ్రామంలో శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం 24వ వార్షికోత్సవ తిరునాళ్లను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. విశేష అలంకరణతో స్వామివారు దర్శనమిచ్చారు. తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ ఆధ్వర్యంలో ఒక్కో ప్రభ, జనసేన, సీపీఎం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ విద్యుత్ ప్రభపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు, మంచినీటి సౌకర్యాలను దేవస్థాన కమిటీ వారు ఏర్పాటు చేశారు. సీఐ సుబ్బారావు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.